క్లుప్తంగా

అంగన్‌వాడీ కేంద్రం తనిఖీ



అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న సూపర్‌వైజర్

తెర్లాం: మండలంలోని జన్నివలస గ్రామంలో గల అంగన్‌వాడీ కేంద్రాన్ని ఐసీడీఎస్ తెర్లాం సెక్టార్ సూపర్‌వైజర్ ఈశ్వరమ్మ శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కేంద్రంలోని ప్రీస్కూల్ పిల్లల హాజరు, కార్యకర్త, హెల్పర్ల హాజరు, స్టాక్ రికార్డులు, స్టాక్, టీహెచ్‌ఆర్ పంపిణీ రికార్డు, పిల్లల బరువులు, ఎత్తుల రికార్డులను పరిశీలించారు. ప్రీస్కూల్ పిల్లల యాక్టివేషన్ గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అంగన్‌వాడీ కేంద్రం పరిసరాలను, కిచెన్ గార్డెన్ తనిఖీ చేశారు. అంగన్‌వాడీ కార్యకర్త లక్ష్మి, హెల్పర్ ఉన్నారు.

ఘనంగా చౌడేశ్వరీ దేవికి పూజలు

రాజాం: మున్సిపాలిటీ పరిధిలోని సంత మార్కెట్‌లో వెలసిన శ్రీకళ్యాణగౌరీ మల్లికార్జునస్వామి ఆలయ ప్రాంగణంలోని చౌడేశ్వరీ దేవి ఆలయ 30వ వార్షికోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా శుక్రవారం చౌడేశ్వరీ దేవికి పంచామృతాభిషేకాలు, కుంకుమ పూజలు, అష్టోత్తర శత నామావళి పూజలు చేపట్టారు. సాయంకాలం సహస్ర దీపాలంకరణ, కర్పూర హారతి, పంచ హారతి, నక్షత్ర హారతి నిర్వహించారు. కార్యక్రమాల్లో ఆలయ అర్చకులు హరవిల్లి హరనాథ శర్మతో పాటు కళ్యాణగౌరీ మల్లికార్జున దేవాంగ సంక్షేమ సంఘం సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

ప్రమాదకర ప్రయాణం



ఆటోలో వేలాడుతూ ప్రమాదకరంగా ప్రయాణం చేస్తున్న విద్యార్థులు

సంతకవిటి: రాజాం నుంచి సంతకవిటి మీదుగా చిత్తారపురం నడుస్తున్న బస్సు కాలేజీ విడిచి పెట్టిన సమయంలో లేకపోవడంతో విద్యార్థులు అధికంగా ఆటోలను ఆశ్రయించాల్సి వస్తుంది. ఇళ్లకు త్వరగా వెళ్లామనే ఆలోచనలతో విద్యార్థులు ఆటోలకు వేలాడుతూ ప్రమాదకరంగా ప్రయాణం చేస్తున్నారు. అధికారులు స్పందించి కాలేజీ, స్కూల్ విడిచి పెట్టిన సమయంలో సంతకవిటి నుంచి చిత్తారపురం వరకు సాధారణ బస్సుగాని, స్టూడెంట్ స్పెషల్ బస్సుగాని ఏర్పాటు చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

28న బుద్ధునితో నా ప్రయాణం నాటకం ప్రదర్శన

రాజాం సిటీ: శ్రీకాకుళంలోని 80 అడుగుల రోడ్డులోని బృందావనం ఫంక్షన్ హాల్‌లో ఈ నెల 28న బుద్ధునితో నా ప్రయాణం నాటక ప్రదర్శన జరుగుతుందని జనవిజ్ఞాన వేదిక గౌరవాధ్యక్షుడు జరజాన నీలయ్య తెలిపారు. శుక్రవారం స్థానిక పెన్షనర్ల సంఘం కార్యాలయంలో నాటకానికి సంబంధించిన కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బౌద్ధాన్ని సులభంగా అర్థం చేసుకోవడానికి దోహదపడుతుందని అన్నారు. కార్యక్రమంలో పెన్షనర్ల సంఘ అధ్యక్షులు ఎస్.గౌరీశంకరరావు, ప్రధాన కార్యదర్శి డోల అప్పలనాయుడు, రౌతు గణపతి రావునాయుడు, బొత్స బుద్ధుడు, గూనాపు తవిటయ్య తదితరులు పాల్గొన్నారు.

వరుస క్రమంలో నాట్లు వేస్తే మంచి దిగుబడులు



చాటాయివలసలో వరుస క్రమంలో నాట్లు వేస్తున్న మహిళా రైతులు

రేగిడి: రైతులు ఖరీఫ్‌లో నాట్లు వేసేటప్పుడు వరుస క్రమంలో వేసుకుంటే పంట ఆరోగ్యవంతంగా ఉండేందుకు ఉపయోగపడుతుందని వ్యవసాయాధికారి బి.శ్రీనివాసరావు రైతులకు సూచించారు. శుక్రవారం మండలంలోని చాటాయివలస, ఉప్పర్నాయుడువలస, గుళ్లపాడు, ఉంగరాడ తదితర గ్రామాల్లో ప్రకృతి వ్యవసాయం సాగు చేస్తున్న పంట పొలాల రైతుల వద్దకు వెళ్లి లైన్‌షోయింగ్ విధానాన్ని పరిశీలించారు. ఈ పద్ధతిని రైతులు అవలంభిస్తే పంటకు గాలి, వెలుతురు చక్కగా తగలడంతో పాటు పిలకలు ఎక్కువగా పెడుతుందని, తద్వారా పంట దిగుబడికి దోహదపడుతుందని అన్నారు. ఎరువులు ఎక్కువ మోతాదులో వేయరాదని సూచించారు.

43.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు

బాడంగి: తుఫాన్ ప్రభావంతో మండలంలో రెండు రోజులుగా 43.6మి.మీటర్ల వర్షం కురిసినట్టు మండల సహాయ గణాంకాధికారిణి రజనీ చెప్పారు. గురు, శుక్రవారాల్లో ఈ మొత్తం వర్షం కురిసినట్టు తెలిపారు. దీంతో మండలంలోని నారుమడులకు ఎంతో ఉపయోగం ఉంటుందన్నారు. కురిసిన వర్షంతో రైతులు వ్యవసాయ పనుల్లో బిజీ అయ్యారు.

చంద్రబాబుది మోసపూరిత మేనిఫెస్టో



కూటమి మేనిఫెస్టోపై యువత, మహిళలను ప్రశ్నిస్తున్న శంబంగి

- వైఎస్సార్‌సీపీ హయాంలో మేనిఫెస్టో పవిత్ర గ్రంథం
- బాబు ష్యూరిటీ – మోసం గ్యారంటీలో మాజీ ఎమ్మెల్యే శంబంగి

బొబ్బిలి: మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సారథ్యంలోని వైఎస్సార్ సీపీ హయాంలో మేనిఫెస్టోను ఓ భగవద్గీత, ఓ బైబిల్, ఓ ఖురాన్‌లా భావించి అందులోని హామీలను చిత్తశుద్ధితో అమలు చేశారని మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు అన్నారు. చంద్రబాబుది మోసపూరిట మేనిఫెస్టో అని ధ్వజమెత్తారు. పట్టణంలోని 5వ వార్డులో బాబు ష్యూరిటీ – మోసం గ్యారంటీ అంటూ రీకాల్ చంద్రబాబు మేనిఫెస్టో కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ బొబ్బిలి ఇన్‌చార్జి శంబంగి వెంకట చిన అప్పలనాయుడు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో శంబంగి ఇంటింటికీ వెళ్లి గడచిన ఎన్నికల ప్రచారంలో చంద్రబాబు నాయుడు కూటమి నేతలతో కలసి పార్టీ ప్రకటించిన మేనిఫెస్టోను చదివి వినిపించారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన మేనిఫెస్టోతో పాటు సూపర్‌సిక్స్ పథకాలను అదనంగా అమలు చేస్తామన్న చంద్రబాబు మీకు ఎన్ని పథకాలు అమలు చేశారని మహిళలు, యువతను అడిగారు. దీనిపై మహిళలు, యువత మాట్లాడుతూ మాకు చంద్రబాబు ప్రకటించిన హామీలేవీ అమలు కాలేదన్నారు. ముఖ్యంగా యువతకు ఇస్తామన్న 20లక్షల ఉద్యోగాలతో పాటు నిరుద్యోగ భృతి అందుతోందా అని యువతను ప్రశ్నించగా చంద్రబాబు ఇస్తామన్న పథకాలేవీ అందలేదని, అందుతాయన్న నమ్మకం కూడా లేదన్నారు. వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి, చంద్రబాబు ఇద్దరూ ముఖ్యమంత్రులుగా అందించిన సేవలను బేరీజు వేసుకోవాలని శంబంగి సూచించారు. వైఎస్సార్ సీపీ మేనిఫెస్టోకు టీడీపీ మేనిఫెస్టోకు చాలా తేడా ఉందని స్థానికులు శంబంగితో అన్నారు. అంతకు ముందు స్థానికులు పార్టీ నేతలను ఘనంగా స్వాగతించారు. మాజీ మున్సిపల్ చైర్మన్లు ఇంటి గోపాలరావు, ఎస్వీ మురళీకృష్ణారావు, పట్టణ పార్టీ అధ్యక్షుడు చోడిగంజి రమేష్ నాయుడు, జేసీఎస్ ఇన్‌చార్జి రేజేటి ఈశ్వరరావు(విసు), మున్సిపల్ వైస్ చైర్మన్ గొలగాని రమాదేవి, 5వ వార్డు ఇన్‌చార్జి మామిడి చంటి, గేదెల అప్పన్న, న్యాయవాది రుంకాన ప్రసాదరావు, కౌన్సిలర్లు, వార్డు ఇన్‌చార్జిలు పాల్గొన్నారు.

హామీలు అమలు చేయమంటే జైలులో పెడతారా..!



బాబు ష్యూరిటీ.. మోసం గ్యారంటీ కరపత్రాలను చూపిస్తూ నిరసన తెలుపుతున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు

మెంటాడ: చంద్రబాబు ఇచ్చిన హామీలను నెరవేర్చలేక అడిగిన వారిని జైల్లో పెడుతున్నారని వైఎఎస్సార్‌సీపీ మండల పార్టీ అధ్యక్షుడు రాయపల్లి రామారావు అన్నారు. మండలంలోని అమరాయవలస, కైలాం, చల్లపేట, కంటుభుక్తవలస గ్రామాల్లో బాబు ష్యూరిటీ.. మోసం గ్యారంటీ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఎంపీపీ రెడ్డి సన్యాసినాయుడు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండిన ప్రతి మహిళకు నెలకు రూ.1500 ఇస్తామని చెప్పి, ఇప్పుడు ఆ పథకం అమలు చేయాలంటే రాష్ట్రాన్ని అమ్మేయాలంటున్నారన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ఈశ్వరరావు, రత్నాకర్ నాయుడు, వైఎస్సార్ సీపీ నాయకులు మాదిరెడ్డి రాము, గండి ఠాగూర్‌నాయుడు, చప్ప సన్యాసప్పడు, కృష్ణ, పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

నిరుపేద విద్యార్థికి చేయూత



విద్యార్థి నానిబాబుకు సైకిల్‌ను అందజేసిన యువత, సర్పంచ్, గ్రామ పెద్దలు, ఉపాధ్యాయులు

తెర్లాం: తమ గ్రామం నుంచి ప్రతీ రోజూ 4 కిలోమీటర్ల దూరంలో ఉన్న ప్రభుత్వ పాఠశాలకు కాలినడకన వస్తున్న నిరుపేద విద్యార్థికి గ్రామానికి చెందిన యువత సైకిల్‌ను వితరణగా అందజేసిన సంఘటన మండలంలోని విజయరాంపురం గ్రామంలో శుక్రవారం జరిగింది. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని గొలుగువలస గ్రామానికి చెందిన వంగ నానిబాబు విజయరాంపురంలోని ప్రాథమికోన్నత పాఠశాలలో ఈ ఏడాది ఆరో తరగతిలో చేరాడు. పాఠశాలకు తమ సొంత గ్రామం నుంచి 4 కిలోమీటర్లు పైనే నడిచి రోజు వెళ్లి వస్తున్నాడు. ఆ విద్యార్థిలో ఉన్న ఆసక్తిని గమనించిన విజయరాంపురంలోని జ్ఞాన సరస్వతి యువజన సేవా సంఘం సభ్యులంతా కలిసి కొంత మొత్తాన్ని సేకరించి కొత్త సైకిల్‌ను కొనుగోలు చేశారు. ఎప్పటిలాగే శుక్రవారం ఉదయం గొలుగువలస నుంచి విజయరాంపురంలోని ప్రాథమికోన్నత పాఠశాలకు కాలినడకన వచ్చిన నానిబాబుకి గ్రామ సర్పంచ్ బూరి మధుసూదనరావు, గ్రామ పెద్దలు, జ్ఞాన సరస్వతి యువజన సేవా సంఘం పెద్దలు, పాఠశాల హెచ్‌ఎం, ఉపాధ్యాయుల చేతుల మీదుగా సైకిల్‌ను వితరణగా అందజేశారు. యువతను మండలంలోని ప్రజాప్రతినిధులు, అధికారులు అభినందించారు.

గిరిజన రైతులకు నష్టం జరిగితే సహించేది లేదు..

- సీపీఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ



గిరిజన రైతులతో కలిసి మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని

రామభద్రపురం: కాకర్లవలస, కారేడువలస నిరుపేద గిరిజన రైతులకు నష్టం కలిగే విధంగా వారి సాగు భూములు ఏపీఐఐసీ అధికారులు అక్రమంగా స్వాధీనం చేసుకుంటే సంహిచేది లేదని సీపీఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ అన్నారు. మండలంలోని కాకర్లవలస, కారేడువలస గిరిజన రైతులు గత నాలుగు రోజులుగా భూ సమస్యలపై నిరసనలు, ధర్నాలు చేపడుతున్న విషయం తెలిసిందే. ఈ మేరకు మిర్తివలస గ్రామ సర్పంచ్ మజ్జి రాంబాబు, సీపీఎం మండల నాయకుడు బలస శ్రీనివాసరావు ఆధ్వర్యంలో శుక్రవారం సీపీఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ పర్యటించి గిరిజన రైతులు నష్టపోతున్న భూములు, పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన విలేకర్లతో మాట్లాడుతూ నిరుపేద గిరిజన రైతులు తరతరాలుగా సాగు చేస్తున్న భూములను ఏపీఐఐసీకి ఎలా కేటాయిస్తారని ప్రభుత్వ అధికారులను ప్రశ్నించారు. ఏపీఐఐసీ అధికారులు సాగులో ఉన్న పంటలను కనీస సమాచారమివ్వకుండా ఎలా ధ్వంసం చేస్తారని ప్రశ్నించారు. ఏపీఐఐసీకి కేటాయించక ముందే గిరిజన రైతులు ఆ భూముల్లో సాగు చేసుకుంటున్నారని, ఇప్పుడు వాటిని ఎంఎస్‌ఎంఈ పార్కు ఏర్పాటు పేరిట అక్రమంగా స్వాధీనం చేసుకోవడం దారుణమన్నారు. సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి గిరిజన రైతులకు న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తామన్నారు. గిరిజన సంఘాల నాయకురాలు తవుడమ్మ, కాంగ్రెస్ మండల నాయకుడు రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శంగా నిలవాలి



గురవాంలో సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీవో

రాజాం: మండలంలోని సంపద తయారీ కేంద్రాలు ఇతర మండలాలకు ఆదర్శంగా నిలవాలని ఎంపీడీవో వి.శ్రీనివాసరావు పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. మండలంలోని గురవాం, కంచరాం గ్రామాల్లో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను ఆయన శుక్రవారం పరిశీలించారు. తడి చెత్త, పొడి చెత్త వేరు చేయడంతో పాటు వాటి ద్వారా సేంద్రియ ఎరువులు తయారీపై క్లాప్ మిత్రలకు అవగాహన కల్పించారు. గ్రామాల్లో ప్రతీ ఇంటి వద్ద వర్మీ కంపోస్టు ఫిట్‌లు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. అన్ని గ్రామాల్లోను పరిశుభ్రత ప్రధానాంశంగా క్లాప్ మిత్రలు, గ్రామ సచివాలయ ఉద్యోగులు పని చేయాలని సూచించారు. అనంతరం ఆయా గ్రామాల్లోని గ్రామ సచివాలయాలు తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఆయా పంచాయతీల సర్పంచ్‌లు, గ్రామ సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.



కాలువల ద్వారా లీకవుతున్న మున్సిపల్ తాగునీరు

తాగునీరు రోడ్డు పాలు

- మరమ్మతుల పేరిట నిధులు ఏమవుతున్నాయో?



అంతర్రాష్ట్ర రహదారిపై ప్రవహిస్తున్న మున్సిపల్ తాగునీరు

బొబ్బిలి: పట్టణంలో 70వేల జనాభాకు అవసరమైన 15లక్షల గ్యాలన్ల నీటిని అందించేందుకు భోజరాజపురం వద్ద గల వేగావతి నదిలో ఇన్‌ఫిల్టర్ బావుల నుంచి నీటిని పాత పైపుల ద్వారా తరలిస్తున్నారు. ఈ తరలింపులో పైపుల నుంచి లీకుల వలన తాగునీరు సుమారు 2లక్షల గ్యాలన్ల శుద్ధ జలం వృథాగా పోతోంది. ఈ పైపుల మరమ్మతులకు ఏటా లక్షలాది రూపాయల నిధులు ఖర్చు చేస్తున్నా లీకులు మాత్రం కొనసాగుతునే ఉన్నాయి. దీంతో ఇంతకీ ఖర్చు చేస్తున్న నిధులు ఏమైపోతున్నాయనే ప్రశ్న ఉత్పన్నమవుతోంది. పట్టణంలో ఉన్న 5,200 కుళాయిల ద్వారా రోజు తప్పించి రోజు తాగునీరు ఇస్తున్నారు. వేసవిలోనే కాదు వర్షాకాలం, శీతాకాలంలోనూ ఇదే పరిస్థితి నెలకొంది. వేసవి కాలం రాక మునుపే రూ.22లక్షలతో ప్రతిపాదనలు పంపించారు. మరో పక్క సాధారణ నిధులతో తరచూ మరమ్మతులు చేయిస్తున్నా లీకుల సమస్య ఎక్కడికక్కడ ఎదురవుతునే ఉంది. వెంటనే లీకులు సరి చేసేందుకు శాశ్వత ప్రాతిపదికన నిధులు మంజూరు చేసి లీకులు అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు. రోజు తప్పించి రోజు కాకుండా రోజువారీ తాగునీరు సరఫరా చేయాలని కోరుతున్నారు.

ఇంటింటా ఫీవర్ సర్వే చేపట్టాలి



శ్రీహరిపురంలో మాట్లాడుతున్న ఎంపీడీవో

వంగర: మండలంలోని అన్ని గ్రామాల్లో ఇంటింటా ఫీవర్ సర్వే నిర్వహించాలని ఎంపీడీవో ఎస్.రఘునాథాచారి అన్నారు. మండలంలోని శ్రీహరిపురం, నీలయ్యవలస గ్రామాల్లో జరుగుతున్న ఫీవర్ సర్వేను శుక్రవారం పరిశీలించారు. అనంతరం సచివాలయ ఉద్యోగులతో సమావేశం నిర్వహించి సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలను అప్రమత్తం చేయాలని సూచించారు.

భక్తిశ్రద్ధలతో శ్రావణ శుక్రవారం పూజలు



బొబ్బిలి: టీఆర్ కాలనీలోని లలితాభ్రమరాంబ ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

ఏటా సంప్రదాయబద్ధంగా వచ్చే శ్రావణ మాస శుక్రవారం పూజలు పట్టణంలోని ఆలయాల్లో ప్రారంభమయ్యాయి. తొలి శుక్రవారం పూజలను ఆలయాల్లోని పురోహితులు నిర్వహించారు. వేకువ జాము నుంచి ఆలయాలకు మహిళలు పోటెత్తారు. భక్తులంతా తీర్థప్రసాదాలను స్వీకరించారు. – సాక్షి నెట్‌వర్క్



రాజాం సిటీ: నవదుర్గ ఆలయంలో పూజలు చేస్తున్న అర్చకులు

పరామర్శ



తాడ్డి బాలకృష్ణను పరామర్శిస్తున్న డాక్టర్ తలే రాజేష్ తదితరులు

రాజాం: మండలంలోని నందబలగ పంచాయతీ లక్ష్మీపురం గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ సీనియర్ నేత తాడ్డి బాలకృష్ణను పార్టీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్ శుక్రవారం పరామర్శించారు. ఇటీవల బాలకృష్ణ కాలికి గాయమై, ఆపరేషన్ జరిగింది. ఆసుపత్రిలో చికిత్స అనంతరం ఇంటి వద్ద కోలుకుంటున్న అతన్ని పరామర్శించి ఆరోగ్యంపై వాకబు చేశారు. ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఆయన వెంట పార్టీ రాజాం రూరల్ అధ్యక్షుడు లావేటి రాజగోపాల నాయుడు, జెడ్పీటీసీ బండి నర్సింహులు, వైస్ ఎంపీపీ యాలాల వెంకటేష్, నందబలగ పంచాయతీ సర్పంచ్ కొర్ను ఈశ్వరరావు, మాజీ సర్పంచ్ బింగి సూర్యనారాయణ, వైఎస్సార్ సీపీ రైతు విభాగం నియోజకవర్గ కన్వీనర్ తాడ్డి గోపాలకృష్ణ, పార్టీ నాయకులు తాడ్డి రాములు, తాడ్డి లక్షున్నాయుడు, గేదెల సత్యం, తాడ్డి సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

మూగ రోదన



తెగిపడిన ఆవు తోకకు వైద్యం చేస్తున్న వెటర్నరీ డాక్టర్ సతీష్

మెంటాడ: బాధ కలిగితే ఎవరైన సరే అమ్మ అంటాం.. కానీ మూగజీవులకొస్తే ఆ రోదన వర్ణణాతీతం. చెప్పుకోలేని బాధను భరిస్తాయి కానీ.. చూసే వారి కళ్లు మాత్రం చమ్మగిల్లుతాయి. మండలంలోని లోతుగెడ్డలో రాటకు కట్టిన ఆవు తోక చిక్కుకుని తెగిపడే ఘటన శుక్రవారం చోటుచేసుకుంది. దీంతో ఆవు యజమాని యడ్ల అడివమ్మ అందుబాటులో ఉన్న వెటర్నరీ వైద్యులు సతీష్, సురేష్‌లను తీసుకొచ్చి శస్త్రచికిత్స చేయించారు. రక్తస్రావం ఎక్కువ కావడంతో సుమారు 2 గంటల పాటు చికిత్స చేశారు. ఆ సమయంలో ఆ మూగజీవి నరక యాతన అనుభవించింది.

చిన్నారులకు సిలబస్ అలవాటు చేయాలి

- ఐసీడీఎస్ పీడీ విమలారాణి



అంగన్‌వాడీ చిన్నారులతో మాట్లాడుతున్న పీడీ

బొబ్బిలి: అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారులకు చిన్నప్పటి నుంచే సిలబస్ ప్రకారం బోధన అలవాటు చేయాలని ఐసీడీఎస్ పీడీ టి.విమలారాణి అన్నారు. పట్టణంలోని స్వామివారి వీధిలోని అంగన్‌వాడీ కేంద్రాలను ఆమె శుక్రవారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా చిన్నారులకు బోధిస్తున్న అంశాలను పరిశీలించారు. వారితో మాట్లాడి ఐక్యూ గుర్తించే ప్రయత్నం చేశారు. కిచెన్ గార్డెన్, బొమ్మలను పరిశీలించారు. అనంతరం స్థానిక సీడీపీవో కార్యాలయాన్ని పరిశీలించి రికార్డులను తనిఖీ చేశారు. అంతకు ముందు పాత బొబ్బిలిలోని బాలసదన్‌ను పరిశీలించారు. ఆమె వెంట సీడీపీవో జె.విజయలక్ష్మి, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, కార్యకర్తలు ఉన్నారు.

ప్రజారోగ్య సంరక్షణే ధ్యేయం

- సచ్ఛ సర్వేక్షన్ గ్రామీణ కేంద్ర బృందం సభ్యులు వినోద్, హరిత



బూసాయవలస వెల్‌నెస్ సెంటర్ వద్ద ఎంపీడీవో రత్నంతో మాట్లాడుతున్న స్వచ్ఛ సర్వేక్షన్ గ్రామీణ కేంద్ర బృందం సభ్యులు హరిత

రామభద్రపురం: ప్రజా ఆరోగ్య సంరక్షణే కేంద్ర ప్రభుత్వ ధ్యేయమని సచ్ఛ సర్వేక్షన్ గ్రామీణ కేంద్ర బృందం సభ్యులు టి.వినోద్, ఎల్.హరిత అన్నారు. మండలంలోని ఎంపీడీవో రత్నం, డిప్యూటీ ఎంపీడీవో వెంకటరమణ ఆధ్వర్యంలో వారు బూసాయవలస, జన్నివలస సచివాలయాలు, వెల్‌నెస్ సెంటర్లు, చెత్త శుద్ధి కేంద్రాలతో పాటు గృహాలలో మరుగు దొడ్లు ఉన్నాయా? లేదా? వినియోగంలో ఉన్నాయా? లేదా? అని శుక్రవారం పరిశీలించారు. చెత్త సేకరణ రిక్షాలు, వాహనాలు ఉన్నాయా లేదా అవి తిరుగుతున్నాయా లేదా? ఇంటింటికీ వస్తున్నాయా.. లేదా.. అని ఆయా గ్రామాల ప్రజలను అడిగి తెలుసుకున్నారు. సచివాలయాలు, వెల్‌నెస్ సెంటర్లు, అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలల ఆవరణలు పరిశుభ్రంగా ఉన్నాయా.. లేదా..? మరుగుదొడ్లు ఉన్నాయా.. లేదా..? ఉంటే అవి వినియోగంలో ఉన్నాయా.. లేదా.. అని పరిశీలించి ట్యాబ్‌లోని ఓ యాప్‌లో నమోదు చేశారు. వారి వెంట ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ప్రవీణ్‌కుమార్, ఆయా సచివాలయాల కార్యదర్శులు ఉన్నారు.

సంక్షిప్తంగా...

ఫిజియోథెరపి సేవలు వినియోగించుకోవాలి

బాడంగి: సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో దివ్యాంగ విద్యార్థులకు అందిస్తున్న ఫిజియోథెరపి సేవలను వినియోగించుకోవాలని డాక్టర్ పతివాడ అఖిల్ అన్నారు. స్థానిక హైస్కూల్‌లో శుక్రవారం విద్యార్థులకు ఫిజియోథెరపి సేవలను అందించారు. దివ్యాంగ విద్యార్థులకు ఈ సేవలతో ఆరోగ్యం మెరుగుపడుతుందన్నారు. ప్రత్యేక ఉపాధ్యాయుడు కె.ఈశ్వరరావు, హెచ్‌ఎం సత్యనారాయణ, భవిత కేంద్ర, ఐఈఆర్‌పీలు సత్యనారాయణమూర్తి, సరిత తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల హాజరు సక్రమంగా ఉండాలి



ఉపాధ్యాయులతో హాజరుపై చర్చిస్తున్న ఎంఈవో

రాజాం: ప్రభుత్వ ఉపాధ్యాయుల బయోమెట్రిక్ హాజరు సక్రమంగా ఉండాలని ఎంఈవో యాగాటి దుర్గారావు అన్నారు. మండలంలోని పొగిరి, కంచరాం, రాజాం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలతో పాటు ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలను శుక్రవారం తనిఖీ చేశారు. విద్యార్థుల హాజరు శాతం, రికార్డుల నిర్వహణ, ఎండీఎం మెనూ అమలుపై ఆరా తీశారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల హాజరు శాతం పెరగాలని అన్నారు.

నిరుపేదలను దత్తత తీసుకోవాలి

బొబ్బిలి రూరల్: నిరుపేదలను గుర్తించి వారిని ఆర్థికంగా బలమైన వారు దత్తత తీసుకోవాలన్నదే పీ 4 ఉద్దేశమని, పేదలను గుర్తించాలని ఎంపీడీవో పి.రవికుమార్ సూచించారు. మండలంలోని కోమటిపల్లి గ్రామ సచివాలయంలో బంగారు కుటుంబాలను తయారు చేసే పలు అంశాలపై సచివాలయ సిబ్బంది, ప్రజాప్రతినిధులకు శుక్రవారం అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏవో అప్పారావు, ఆదినారాయణ, కార్యదర్శి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

విద్యా ప్రమాణాలు మెరుగుపరచాలి

తెర్లాం: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ఉపాధ్యాయులు విద్యా బోధన చేయాలని ఎంఈవో త్రినాధరావు అన్నారు. మండలంలోని వి.చిన్నయ్యపేట బేసిక్ ప్రైమరీ స్కూల్‌ను శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల విద్యా ప్రమాణాలను పరిశీలించారు. పాఠశాలలో మరుగు దొడ్లు, మధ్యాహ్న భోజన పథకాన్ని తనిఖీ చేశారు.

రైతులకు అవగాహన

బొబ్బిలి రూరల్: రైతులు వరి పంట పొలంలో నాట్లు వేసే ముందుగా నారును కట్టలు కట్టి వాటిని నానో యూరియా, నానో డీఏపీ ద్రావణంలో ముంచి తరువాత నాట్లు వేయాలని వ్యవసాయ శాఖ ఏడీఏ మజ్జి శ్యాంసుందర్ రైతులకు వివరించారు. కలవరాయి గ్రామంలో రైతులకు వరినాట్లు వేసే విధానం,ఎరువుల వినియోగంపై అవగాహన కల్పించారు. రైతులు, వీఏఏ రమాదేవి, రవళి పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణపై ప్రజలకు అవగాహన

రేగిడి: ప్రమాదాల నివారణకు సంబంధించి ప్రజలకు స్థానిక ఎస్ఐ పి.నీలావతి శుక్రవారం అవగాహన కల్పించారు. స్థానిక ఉంగరాడ మెట్ట వద్ద నుంచి మజ్జిరాముడుపేట వరకు వాహనదారులతో ర్యాలీ నిర్వహించారు.

కొట్లాట కేసు నమోదు

సంతకవిటి: జీఎస్.పురం గ్రామానికి చెందిన రామతోట రజనిపై ఆమె మరుదులు, తోటికోడళ్లు దాడి చేసిన ఘటనలో అందిన ఫిర్యాదు మేరకు కొట్లాట కేసు నమోదు చేసినట్టు ఎస్సై ఆర్.గోపాలరావు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. రజని 2008లో ప్రభుత్వ సహకారంతో గ్రామంలో ఓ ఇంటిని నిర్మించుకుంది. కూలి పనుల నిమిత్తం ఆమె బయటకు వెళ్లగా అప్పటి నుంచి ఆమె మరుదులు, తోటికోడళ్లు ఆ ఇంటిలో నివాసం ఉంటున్నారు. ఇంటిని ఖాళీ చేయమని రజని గురువారం అడగ్గా మరుదులు, తోటికోడళ్లు రాపతోట రూప, సూర్యనారాయణ, సీతారాం, విజయ ఆమెపై దాడి చేయడంతో రాజాంలోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. బాధితురాలు రజని శుక్రవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.